
వారం వారం

# ఏ జోడీ చేసింది ఈ ఖూనీ?

అవసరాల రామకృష్ణారావు




త్రవ్వకాలలో మనుషులు నాగరికతకి ఆధారం దొరుకుతుందంటారు. ఒక్కొక్కప్పుడు అనాగరికతకీ అమానుషానికీ రుజువు దొరుకుతూ ఉంటుంది. లేకపోతే పునాదులు తవ్వుతూంటే పువ్వులాంటి ఆ అమ్మాయి శవం బయటపడ్డ మేమిటి! వెనకనుంచి తలమీద కొట్టి హత్య చేసినట్టు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అది చూసి హడలిపోయి కూలీలయితే పారిపోయారు గాని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంటు ఎలా తప్పించుకోగలదు? ఛీఫ్ ఇనస్పెక్టరు చిదంబరం ఆపల్లెటూరికి చేరుకోక తప్ప లేదు.

## లఘిమా లంకిణీ సొల్యూషను

సంఘటన మొదటిపేరాలోనే తెలుస్తోంది, వక్రతుండం, వజ్రఖండం ఏదోవిధంగా వాయుగుండంని మోసపుచ్చాలని నిశ్చయించుకున్నారని. వజ్రఖండం ఆ 'లంకిణీ'గదిలో దిగాలని నిశ్చయించుకున్నట్టూ వక్రతుండం అంతకంటె ప్రమాదంలేదని వారించినట్టూ సమయానుకూలంగా వాళ్లిద్దరూ కలసి పెంచిన రగడ. అదే ఆఖరికి వాయుగుండం పందెం వెయ్యడానికి దారి తీసింది.

ఆ పందెం సొమ్ము, చెరోరెండు అయిదు వేలూ, వాళ్లిద్దరూ పంచుకున్నట్లు వేరే చెప్పక్కర్లేదు. సీలుసీలులాగే ఉన్నా, తాళం అలాగే ఉన్నా లోపల ప్రవేశించగలగడం, ఇవతలికి వచ్చి లోపల గడియ పడేలా చూసుకోడం వాళ్లిద్దరూ జీవితమంతా సాధన చేసి నిష్ణాతులైన ప్రొఫెషనల్ ఆర్ట్‌మాత్రమే. వజ్రఖండం వక్రతుండం సహకార సహాయలతో బయటపడి ఏ ఊరైనా కొన్నాళ్ళపాటు పారిపోయి ఉండాలి.

మరి ఒకదానికన్న ఒకటి చిన్నవైన అడుగుల ముద్రలు? దీనికి జవాబు కూడా సంఘటన వర్ణనలోనే ఉంది!

'ఒకరూ ఇద్దరూ కాదు, వరసగా ఇంతా ఇంతా అయిదుగురు కొడుకులు నాకు!' అని వక్రతుండం చెప్పనే చెప్పేడు. తండ్రికి అప్పనంగా అంత సొమ్ము వచ్చిపడుతూంటే పాదముద్రల్లో సహకరించి ఆ మాత్రం పితృరుణం తీర్చుకోరంటారా! అమావాశ్యా అర్ధరాత్రి ఆపాటి సాయం చెయ్యరా!

స్థానిక పోలీసు విభాగం హతురాలి గురించి ఇప్పటికి సేకరించిన వివరాలు ఇవీ: పేరు గౌరి. వయసు ఇరవై ఏడు. తల్లి దండ్రులు పోయారు. పెళ్లికాలేదు. అన్నా వదినల దగ్గర ఉంటోంది. సంగీత పాఠాలు చెప్పుకు బతుకుతూ ఉండేదిట. కనిపించకుండా పోయిన నాడు రాత్రి కూడా మునసబుగారి పెద్దమ్మాయికి పాఠం చెప్పి వెళ్ళిందిట.

చిదంబరం ఆ ఊళ్లో మొట్టమొదట కలుసుకున్నది మునసబుగారి భార్య ఆండాళ్లమ్మ గార్ని. గొక్కున్నల్లు జేబులోమినీపాకెట్ టేప్‌ని ఆన్‌చేస్తూ 'మనిషి బంగారం బాబూ గౌరి దేవతగాని! అంతటినెమ్మదస్తురాల్ని, తలవంచుకుని తనపని తను చేసుకుపోయేదాన్ని

చేజేతులా చంపడానికి ఏ పాపిష్టివాడికి చేతులొచ్చాయో! ఈ ఆరునెలలకే మాపాపకి ఎంత మంచి తర్ఫీదు యిచ్చిందో! పండుగా పబ్బంనాడయినా శలవు పెట్టి ఎరగదు. ఇంకా ఆ తియ్యనిగొంతుక వింటున్నట్టే ఉంది. ఆ రోజు శనివారం, సూర్యగ్రహణం, నాకు బాగా జ్ఞాపకం 'మర్నాడు వద్దువు గాని,లేమ్మా' అంటే వింటా పిచ్చి పిల్ల!' అయిదున్నరకి విడుపు స్నానం అయిపోతుంది కదండీ పిన్నిగారూ, రాత్రి ఏడింటికి వచ్చి ఎనిమిదింటిదాకా చెప్తానులెండి. కొత్తకీర్తన ఓ చరణం ఉండిపోయింది. అదిపూర్తిచేస్తే గాని నాకు తోచదు అంటూ ఆవేళకి వచ్చి అది అయిందనిపించి మరీవెళ్లింది. అదే ఆఖరు అని మాకేం తెలుసు!'

గౌరి సంగీతం చెప్పే మరో రెండిళ్లోనూ ఆమె అలాంటి సర్టిఫికేట్ సంపాదించింది. చిదంబరం గౌరి అన్నయింటికి వెళ్లాడు. అతను లేడు. వదిన సైజు చిన్నదీ స్వరంపెద్దదీ.

'మాకింత అపకీర్తితేడానికి కాకపోతే ఆ అమ్మాయి ఇంటింటికీ వెళ్లి పాటలు చెప్పి డబ్బు సంపాదించాలా చెప్పండి! ఇంతకీ మాకేం పిల్లా జల్లా? పొలంమీద వచ్చేదాన్తో మావారువెల్లినే పోషించుకోలేక పోతారా! ఇంతకీ మావగారు గౌరి పెళ్ళికని ముప్పైవేలు వేరే ఉంచనే ఉంచారు. వద్దంటే వినకుండా ఆ మేఢిపండు వెధవ రాజా మీద మనసు పెట్టుకుందిగాని లేకపోతే ఆ అమ్మాయికి ఎప్పుడో పెళ్లి అయిఉండేది'

'రాజా ఎవడండీ?'

'ఉన్నాడులెండి, ఈ ఊరికి ఓ దిష్టిబొమ్మ. ప్రెసిడెంటు గారికి ఆఖరి బావమరిది. ఎంతొచ్చినా వాడి తాగుడికీ పేకాటకీ చాలదు.'నువ్వు కాదమ్మా, వాడిదృష్టి నీకట్నంమీద' అంటే మా వెర్రిది వింటుందా? రెణ్నెల్ల క్రితం మావూరికి ఆ బంగారు పిచిక వచ్చేదాకా ఆ దగుల్బాజీ మా గౌరి వెనకే తిరిగేవాడనుకోండి'

'అదెవరండోయ్?'

'కరణంగారి మరదలు కనకలత అని ఓ షోకిల్లా. దాన్ని కప్పెట్టేనంత ఆస్తి దానికి. రావడమేమిటి, ఇలా రాజాగాణ్ణి చుట్టూ తిప్పుకోడమేమిటి! ఈ మధ్య పెళ్లన వాణ్ణి పెళ్ళిచేసుకుందికూడా. మూడొంతులు అదే మాగౌరి తనదారికడ్డురాకుండా చేసుకుని ఉండాలి. ఈ పల్లెటూళ్ళో ఏమైనా సరైన దార్లా దీపాలా? ఇద్దరు దుర్మార్గులు తలుచుకుని ఓ పసిపిల్లని చంపిపారేస్తే దానికేం రుజువా, సాక్ష్యమా!

చిదంబరం ఆ రోజే కనకలతని కూడా కలుసుకున్నాడు. డబ్బున్నదే గాక ఆవిడ మంచి అందగత్తెకూడా. రాజా ఊళ్లో లేడట. 'డబ్బు దగ్గిర ఉన్నేమిటి, చెల్లెలేమిటి! తండ్రి విల్లుప్రకారం గౌరి ప్రమాదవశాత్తూ పోతే ఆ సొమ్ము అన్నకే చెందుతుంది. అందుకే పెళ్లాం చెప్పుడు మాటలు విని సొంత చెల్లి గొంతు కోశాడు ఛండాలుడు. చెల్లిపోయి నెల్లాళ్లు దాటిందో లేదో కొత్త ట్రాక్టరు కొనుక్కున్నాడు, ఇన్నాళ్లు లేంది ఎలా వచ్చిందంటారు'?

అలాగే జరిగిఉంటుందని తనూ నమ్ముతున్నాడని చెప్పాడు చిదంబరం. కాని ఆ హంతకుడికి శిక్ష పడాలంటే ఏదైనా ఖచ్చితమైన రుజువుకావాలి. ఆ హత్య జరిగిన రాత్రి తనూ ఊళ్లోనే ఉంది కదా. గుర్తుతెచ్చుకుని ఏ చిన్న విషయమైనా చెప్పమని అడిగాడు. కాస్సేపు, ఆలోచించి కనకలత చెప్పిన విషయం ఇదీ:

'ఇరవై అయిదో ఆరో డేటు గుర్తులేదు కాని ఆరోజు శనివారం. ఎందుకంటే ఆ రాత్రి మేం భోజనాలు చెయ్యం. మా అమ్మ ఇడ్లీలు చాలాబాగా చేస్తుందని రాజాని టిఫినుకి పిల్చాను. పెరటి గదిలో కూచున్నాం. మాపెళ్ళి అప్పటికే నిశ్చయమైపోయింది. గనక మావాళ్ళు ఏం అనలేదు. మునసబుగారి ఇంటి నుంచి గౌరి వాళ్ల యింటికి వెళ్లే పుంతదారి మా పెరటిగది కిటికీలోంచి స్పష్టంగా చూశాం. మామూలుగా అయితే మా ఊళ్లో చీకటి గుయ్యారంగాని ఆరోజు పండు వెన్నెల. ముందుగా గౌరి, కొంచెందూరంలో వెనకగా అన్నావదినా. కాస్సేపట్లో ముగ్గురూ చింత తోపులో మాయమయ్యారు. రాత్రివేళ పిల్లని ఇంటికి తీసుకు రావడానికి వెడుతున్నారనుకున్నాం గాని.....

ఆరోజు రాత్రి హోటల్‌రూంలో సిగరెట్‌మీద సిగరెట్ ఊదేస్తూ చిదంబరం— తను రహస్యంగా టేపుచేసిన తన ఆనాటి ఇంటర్వ్యూలు మళ్ళీ మళ్ళీ విన్నాడు. ఓ లక్కీమూమెంట్‌లో అతనికి నిజం రుజువుతో సహా తెలిసినట్టయింది. ఇంతకీ ఎవరు చేశారు ఈ హత్య?

## వారం వారం హాహాకారం

# సొల్యూషన్ చెప్పిన పాఠకులకు రూ.116/- బహుమానం

అడుగడుగునా ఉత్కంఠ, అనుక్షణం ఉద్వేగం, అణువణువునా ఉత్తేజం...రేకెత్తించే కథలను 'ఉదయం' మీకు ఈ వారం 'వారం హాహాకారం' శీర్షికన అందిస్తున్నది. ఈ శీర్షికను, పాఠకుల్ని ఆహ్లాదపరుస్తూ, వారి ఆలోచనలకు పదును పెట్టే అవసరాన్ని గుర్తెరిగిన అవసరాల రామకృష్ణారావు నిర్వహిస్తున్నారు. అయితే ఆయన కథ మాత్రమే చెబుతాడు. ముగింపుమీరేచెప్పాలి. 'సస్పెన్స్'లో ఆగిపోయిన మూలకథలకి సొల్యూషన్ మీరే చెప్పాలి. కేవలం హిస్టరీని వర్ణించిన కథలో మిస్టరీ ఏమిటో మీరే తర్కించాలి. ఇదో థ్రిల్లింగ్ క్విజ్! పాఠ్గాని రచయిత ఊహకు సరిపోలిన సమాధానం పంపి, విజయులైన పాఠకులకు 'ఉదయం' *116/*–రూపాయల బహుమతి ఇస్తాం.

శీర్షికకు సొల్యూషన్‌ను *14*వ తేదీలోగా మాకు చేరేటట్లుగా పంపాలి.

# లక్షిమా లంకిణీ విజేతలు

*1.* ఎమ్.వి.సుబ్బారావు— పోరుమామిళ్ళ, కడపజిల్లా
*2.* వి.ప్రభాకర్— చిక్కడపల్లి
*3.* యర్రంశెట్టి వెంకట బాలకృష్ణ— తాడేపల్లిగూడెం
*4.* జి.రమేష్‌బాబు— సుంతకల్లు.
*5.* వై.శ్రీనివాసరావు— కర్నూల్.
*6.* వి.శంకర్ రెడ్డి— వికర్ వాడి.
*7.* వి.సాయిలత— విజయవాడ.
*8.* ఎస్.బి.ప్రసాద్— నకిరేకల్.
*9.* శ్రీమతి వి.సూర్యకుమారి— ఎల్.ఎం.జి. కాలనీ, కరీంనగర్ జిల్లా.
*10.* బొడ్డపాటి భవానీదేవి— చిక్కడపల్లి
*11.* పి.రామకృష్ణారెడ్డి— యానాం.
*12.* ఎస్.కరీముల్లా— చింతలపూడి
*13.* పింజమూరి కృష్ణమూర్తి— వరంగల్
*14.* నారా విజయసారధి నాయుడు— కర్నూల్
*15.* వి.వి.పార్వతీశం— వరంగల్
*16.* వి.ఆర్.జి.వర్మ— రంపచోడవరం

సమస్యకు సరైన సొల్యూషన్ పంపిన విజేతల సంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల వారందరికే 'ఉదయం వీక్లీ' పంపుతున్నాం.